# ఆచార్యదేవోభవ

**"ఒక కప్పు కాఫీ తీసుకురా పార్వతీ" అంటూ పేపర్‌లోంచి తల పైకెత్తకుండానే కేకేశారు రఘురామయ్య మాస్టారు.**

**"వస్తున్నా" అంటూ లోపల్నుంచి పలికింది ఆయన భార్య పార్వతమ్మ.**

రోజూ పేపర్ కోసం అరగంట ముందు నుండి ఎదురుచూడటం, పేపర్ రాగానే ఆమూలాగ్రం దాన్ని చదవడం ఆయనకున్న అలవాటు. ఆరోజు కూడా అలాగే పేపర్ చదవడం మొదలుపెట్టారు.

ఆరోజు ఉపాధ్యాయ దినోత్సవం. దానికి సంబంధించి పేపర్లో స్పెషల్ న్యూస్ ఏమున్నాయా అని చూస్తున్నారు మాస్టారు. ఆ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనవారి పేర్లు ప్రకటించారు. అక్కడ ఆగిపోయింది మాస్టారి దృష్టి. ఆ పేర్లలో తమ ఊరి పేరు కూడా వుండడం చూసి 'అంతటి అదృష్టవంతులు ఎవరా?' అని ఆశ్చర్యంగా చూశారు. అది గోవిందం మాస్టారి పేరు. పేరు చదివి నిశ్చేష్టులయ్యారు. గోవిందం మాస్టారికి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు వచ్చింది. కనీసం రెండురోజులకు ఒకసారన్నా తరగతి ముఖం ఎరుగనివారికి అవార్డు రావడం! వార్త చదివిన మాస్టారి ముఖం తీవ్రమైన ఆందోళనతో నిండిపోయింది.

రాఘవయ్య మాస్టారు ఆ ఊరి ప్రభుత్వ పాఠశాలలో లెక్కల మాస్టారు. అలుపెరుగని శ్రమజీవిగా ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి ఆయన్నెరుగుదురు. కర్తవ్య నిర్వహణలో ఎటువంటి ఆటుపోట్లను కూడా లెక్కచెయ్యకుండా, తల పండిన తన అనుభవాలతో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో మాస్టారిది అందెవేసిన చెయ్యి. ఖాళీ పీరియడ్ల పేరుతో స్టాఫ్ రూంలో చేరి అనవసరపు విషయాల గురించి గంటల కొద్దీ కాలక్షేపం చేసే ఉపాధ్యాయులున్న ఈ రోజుల్లో రాఘవయ్యగారి లాంటివారు చాలా అరుదుగా వుంటారు. వృత్తే దైవంగా, అంకితభావంతో పనిచేసే మాస్టారి లాంటివారికి ఈ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తప్పకుండా వస్తుందని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా ఎదురుచూస్తున్నారు. అయితే పేపర్లో ఇలాంటి వార్త రావడం మాస్టారిని తీవ్రంగా కదిలించింది. అయితే అది తనకు రాలేదని



ఈర్ష్య, అసూయ అనుకుంటే పొరపాటే.

ఇంతలో కాఫీ కప్పుతో అక్కడికి వచ్చిన పార్వతమ్మ భర్త మొహంలోని ఆందోళనను గమనించి "ఏం జరిగిందండీ, ఎందుకలా వున్నారు?" అని ప్రశ్నించింది.

"ఏంలేదు పార్వతీ, చూడు ఎంతటి అన్యాయం జరుగుతోందో. ఉపాధ్యాయుడి ప్రతిభ, అంకిత భావాలకు గుర్తుగా ఇవ్వవలసిన అవార్డులు- రికమెండేషన్స్‌కి, లంచగొండితనానికి అమ్ముడుపోతున్నాయి. ఇది ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థి లోకానికి అవమానం" అంటూ జరిగింది వివరించారు.

మాస్టారి గొంతులోని ఆర్ద్రతను గమనించిన పార్వతమ్మ "కాలమే అలా వుంది. బాధపడి ఏం ప్రయోజనం చెప్పండి" అనడంతో

"నాకు రాలేదని బాధపడడం లేదు పార్వతీ. విధి నిర్వహణలో తన బాధ్యత తను నిర్వహించే సమర్థత లేని వారికి అవార్డులు, బహుమతుల పేరుతో ప్రోత్సహిస్తున్నందుకు బాధగా వుంది" నిట్టూర్చారు మాస్టారు.

ఇంతలో తలుపు కొడుతున్న చప్పుడవడంతో పార్వతమ్మ వెళ్లి తలుపు తీసింది. తలుపు తీయగానే ఓ పదిమంది పిల్లలు నెట్టుకుంటూ గబగబా లోపలికి వచ్చారు.

"అరెరె ఏమిటయ్యా ఇది, ఏం జరిగింది?" కంగారుగా ప్రశ్నించింది.

"ఏం లేదండీ, ఈరోజు టీచర్స్ డే కదా, మేమంతా మా మాస్టారిని సన్మానించాలనుకుంటున్నాం. మాకు చదువు మాత్రమే కాకుండా క్రమశిక్షణ, సత్ప్రవర్తన నేర్పిన మా మాస్టారికి మేమెంతో ఋణపడి వున్నాం" అని పిల్లలంతా పలకడంతో పార్వతమ్మగారి కళ్లవెంట ఆనందభాష్పాలు రాలాయి.

ఈ హడావుడికి విషయం గ్రహించిన మాస్టారు పిల్లల దగ్గరకు వచ్చారు. పిల్లలంతా ఒకరొకరుగా వారికి పాదాభివందనం చేసి చిరుకానుకలు అందజేశారు. "ఈ బహుమతులు కాదయ్యా కావలసింది. మీరంతా భావిభారత పౌరులుగా ఎదిగి దేశానికి ఉపయోగపడాలి. అప్పుడే నేను నేర్పిన పాఠాలకు సార్థకత" అంటూ పిల్లలను తన అక్కున చేర్చుకున్నారు. పిల్లల ఆప్యాయత, అనురాగాలతో మాస్టారికి కొన్ని వేల అవార్డులు పొందిన అనుభూతి కలిగింది.

**-గాడేపల్లి పద్మజ (మాచర్ల)**




